

17న వైవీయూలో పిహెచ్‌డి ప్రవేశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని వైవీయూ క్యాంపస్ కళాశాల, వైవీయూ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 2022-23 విద్యా సంవత్సరానికి పిహెచ్‌డిలో ప్రవేశానికి ఈనెల 17న నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపిఆర్ సెట్‌లో అర్హత సాధించిన వారు అర్హులన్నారు. వైవీయూ పరిధిలోని 25 డిపార్ట్‌మెంట్లలో 107 పిహెచ్‌డి సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో ఫుల్ టైం 77, పార్ట్ టైం 17, అఫిలియేటెడ్ రీసెర్చ్ సెంటర్ లో 13 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, గేట్ వంటి అర్హతగలవారు ధ్రువీకరణ పత్రాలతో వైవీయూలోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

స్టాఫ్‌నర్సుల భర్తీలో గోల్‌మాల్

జిల్లాలో స్టాఫ్ నర్సుల భర్తీలో గోల్‌మాల్ నడిచింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద కడప రీజనల్ డైరెక్టర్ కార్యాలయ యంత్రాంగం పెద్దఎత్తున నర్సింగ్ పోస్టులను భర్తీ చేసింది. దీన్ని ఆసరాగా తీసుకుని చిత్తూరు జిల్లా కేంద్రంగా ఓ గ్యాంగ్ దరఖాస్తుదారుల ఒరిజినల్ మార్కులిస్టుల్లోని మార్కులను హైప్ చేసి బోగస్ మార్కులుగా మార్చి అనర్హులకు ఉద్యోగాలు దక్కేలా చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల చిత్తూరు జిల్లా కేంద్రంగా వచ్చిన ఫిర్యాదు ఆధారంగా వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ ఎనిమిది మంది ఒరిజినల్ మార్కులిస్టులను పరిశీలించి ఉద్యోగాలు పొందిన మార్కులను బోగస్ మార్కులుగా నిర్ధారించి పంపించింది.



బోగస్ మార్కులతో ఉద్యోగాలు

ఏడుగురికి షోకాజ్ నోటీసులు?

చిత్తూరు జిల్లా కేంద్రంగా మాఫియా

మార్కుల మాఫియాపై చర్యలు లేనట్లేనా!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ 2022 నవంబర్‌లో 957 స్టాఫ్‌నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జోన్-4 కేటగిరీ కింద 291 స్టాఫ్‌నర్స్ పోస్టులను కేటాయించింది. కడప ఆర్‌డి కార్యాలయం 2023 జనవరి మూడవ వారంలో స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేసింది. గైడ్‌లెన్స్ ప్రకారం నియమకాలు చేపట్టకపోవడంతో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. స్టాఫ్‌నర్స్ దరఖాస్తులు, కోవిడ్ సేవల సీనియారిటీ పత్రాలు పరిశీలనలో నిర్లక్ష్యం మొదలుకుని బోగస్ మార్కులు, ఫేక్‌సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు సమాచారం. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ దరఖాస్తుదారు రిక్రూట్‌మెంట్‌లో మార్కుల ఆధారంగా ఉద్యోగాలు పొందడంపై అనుమానం రావడంతో చేసిన ఫిర్యాదు ఆధారంగా డొంకంతా కదిలింది. రాజధాని కేంద్రంలోని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ 44 అనుమానిత దరఖాస్తుల్లో 15 దరఖాస్తులను పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. వీటిలో ఎనిమిది మంది మార్కులను బోగస్ మార్కులుగా నిర్ధారించింది. చిత్తూరు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఆరుగురు, ఆర్‌డి కార్యాలయ పరిధిలోఉద్యోగాలు పొందిన ఇద్దరు, ఒకరు ఉద్యోగంలో చేరాల్సి ఉన్నట్లు తేలింది. వీరిద్దరికి ఆర్‌డి కార్యాలయం షోకాజ్ నోటీసులు పంపించినట్లు సమాచారం. మిగిలిన ఆరుగురికి వైద్యవిధాన పరిషత్ అధికార యంత్రాంగం షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో చోటుచేసుకున్న ఇటువంటి ఘటనలో కేసు నమోదు చేసి, సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజా ఉదంతంలో ఇటువంటి దిశగా ఆలోచనలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సిఐడి దర్యాప్తునకు ఆదేశించాలనే డిమాండ్ ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి వినిపిస్తోంది.

బోగస్ మార్కుల మాట వాస్తవమే

స్టాఫ్‌నర్సుల రిక్రూట్‌మెంట్‌లో ఎనిమిది మంది ఒరిజినల్ మార్కులిస్టుల్లోని మార్కులను హైప్ చేసిన మార్కులు బోగస్‌గా తేలిన మాట వాస్తవమే. వీరిలో ఏడుగురు ఉద్యోగాల్లో ఉన్నారని, ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం. మిగిలిన వారికి రాష్ట్ర వైద్య విధాన పరిషత్ షోకాజ్ నోటీసులు పంపించాల్సి ఉంది. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే ఆలోచనలు ఉన్నాయి.

- డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, కడప.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల ఏర్పాటు
- ఒక్క నిమిషం నిబంధన

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు. మొదటి సంవత్సరం 18,377 మంది, ద్వితీయ సంవత్సరం 24,696 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. పటిష్ట భద్రత కల్పించారు. పరీక్షా కేంద్రాలన్నీ ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా జిల్లా ఆర్‌ఐఒ, ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో అధికారులు పర్యవేక్షించనున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక హై పవర్ కమిటీని ఏర్పాటు చేశారు. 4 ఫ్లయింగ్ స్క్వాడ్, 10 మంది సిట్టింగ్ స్క్వాడ్, 10 సెంట్ కస్టోడియన్లుగా విధులు నిర్వహించనున్నారు. సమస్య లుంటే ఆర్ఐఒ కార్యాలయంలోని కంట్రోల్ 08562-244171కు ఫోన్ చేయ వచ్చని అధికారులు సూచించారు. పరీక్షలకు సంబంధించి సెల్ ఫోన్స్, యూట్యూబుల ద్వారా వచ్చే ఎలాంటి పుకార్లను నమ్మవద్దని కోరారు.



బిసిల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం

- బిసిల సదస్సులో నారా లోకేష్



సదస్సులో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బిసిల రక్షణ కోసం ప్రత్యేకంగా బిసి రక్షణ చట్టం తీసుకొస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 42వ రోజుకు చేరుకుంది. మంగళవారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోటలోని కంటేవారిపల్లె నుంచి ప్రారంభమైన పాదయాత్ర బి.కొత్తకోట మండలంలోని కండ్లమడుగు క్రాస్, హార్సిలీహిల్స్ క్రాస్, మద్దయ్యప్పగారిపల్లె, మొగసాలమర్రి, కుమ్మరపల్లి, నాయనిబావి పంచాయతీ పరిధిలోని గుట్టపాలెం విడిది కేంద్రం వరకు పాద యాత్ర సాగుతుంది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, బిసి సామాజిక వర్గీయులు, మహిళలు, డెయిరీ రైతులతో మాటామంతి, ముఖాముఖి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దమద్యం మండలంలోని ప్రజలతో మద్దయ్యప్పగారిపల్లె వద్ద భేటీ అయ్యారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో బిసిలను అన్ని విధాల ఆదుకున్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక సామాజిక న్యాయం పేరుతో బిసిలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిం చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2 వేల మందికిపైన, రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది బిసిలపై అక్రమ కేసులు బనాయించిందని తెలిపారు. వారి తరఫున తాను పోరాటం చేస్తున్నానన్నారు. 57 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా, వాటికి ఇంత వరకు నిధులు కేటాయించడం పాపాన పోలేద న్నారు. అమరావతిలో కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లకు కూర్చోవడానికి కనీసం కుర్చీలు కూడా లేవని ఎద్దేవా చేశాడు. తాము అధికారంలోకి రాగానే బిసిలపైన పెట్టిన కేసులను ఎత్తివేస్తామని, అక్రమ కేసులు బనాయించిన అధికారులపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేసి శిక్షపడేలా చూస్తామన్నారు. యాదవ, కురువ, కుమ్మర, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, వడ్డెర, పద్మశాలి, రజకులు, వాల్మీకుల, పాల ఏకిర్లకు ఇతర బిసి ఉపకులాలకు ప్రత్యేకంగా ఫెడరేషన్లను ఏర్పాటు చేసి దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం బిసి విద్యా ర్థుల ఉన్నత చదువుల కోసం ఏర్పాటు చేసిన అన్ని పథకాలు రద్దు చేసి తీరని ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు జగన్ బిసిలకు కొండంత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాకా చెవిలో పువ్వు పెట్టారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డెర్లకు క్వారీలు కేటాయిస్తామని తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో ఉప కులాల వారిగా భవనాలు నిర్మిస్తామని, ఆ తరువాత మండలాల వారీగా భవనాలు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. తిరుమలతో సహా ఇతర దేవస్థానాల్లో దుస్తులు ఉతికే కాంట్రాక్ట్ రజకులకు కేటాయిస్తామన్నారు. టిడిపి హయాంలో బిసిలకు 34 శాతం ఉన్న రిజర్వేషన్లు జగన్ 10 శాతం తగ్గించి బిసిలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. 16,500 మంది బిసిలు పదవులు కోల్పోయారని తెలిపారు. జగన్ తగ్గించిన రిజ ర్వేషన్లు తిరిగి కల్పిస్తామన్నారు. బిసి జనగణన జరగాలని అప్పుడే వారికి న్యా యం జరుగుతుందన్నారు. దీని కోసం ఢిల్లీ స్థాయిలో పోరాడుతున్నామని చెప్పారు. బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చేందుకు టిడిపి వేసిన సత్యపాల్ కమిటీ రిపోర్ట్‌ని జగన్ మూలన పడేశారన్నారు. 420కి ట్రేడ్ మార్క్‌గా జగన్ ఉన్నా రన్నారు. నేను జగన్‌లా రూ.లక్ష కోట్లు దోచి జైలుకి వెళ్ళలేదన్నారు. బాబాయ్‌ని చంపేసి నాట్ టూ అరెస్టు అని కోర్టుకు జగన్ అండ్ కో వెళ్లారని తెలిపారు. కేవలం ప్రజల తరపున పోరాడినందుకు నాపై అక్రమ కేసులు పెడుతున్నార న్నారు. ఎన్ని కేసులు పెట్టుకున్నా నేను రెడీగా ఉన్నానని తెలిపారు. వైసిపి పాలనలో ధరలు ఆకాశాన్నంటాయన్నారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, ఇంటిపన్ను, చెత్తపన్నుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో పీల్చే గాలికి కూడా జగన్ రెడ్డి పన్ను వేసేలా ప్రవ ర్తిస్తున్నాడని పేర్కొన్నారు. జగన్ పాలన తాలిబన్ల పాలనను మించిపోయిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, టిడిపి రాజంపేట పార్ల మెంట్ అభ్యర్థి గంటా నరహరి, తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవర్గాల ఇన్‌ఛా ర్జులు జి.శంకర్ యాదవ్, దొమ్మలపాటి రమేష్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్, రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, పెద్దమండ్యం మండల టిడిపి అధ్యక్షులు జిట్టా వెంకటరమణ, మైసూర్ శ్రీనివాసులు యాదవ్, బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు ముంబై దుర్గా, మహిళా నాయకులు విజయమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి బహుమానాలు అందుకోవడం అభినందనీయమని కలెక్టర్ వి.విజయ్ రామరాజు ప్రశంసించారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి, రాష్ట్ర స్థాయిలో 7, 10వ తరగతులు చదు వుతున్న విద్యార్థులకు నిర్వహించిన మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి దీవెనలు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. మన జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడం శుభ పరిణామమని, ఇలాంటి విజయాలు మరెన్నో మీరు సాధించాలని పేర్కొన్నారు. ఇఎంటి ప్రతిబ పరీక్ష వివరాలను జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పదో తరగతిలో మొదటి స్థానం పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రూ.30 వేలు, మెమోంటో, సర్టిఫికెట్‌ను అందుకున్నారని చెప్పారు. ఏడో తరగతిలో మైదుకూరు మండలం శెట్టివారిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రూ.20 వేలు, మెమోంటో, సర్టిఫెంట్ పొందరని తెలిపారు. జిల్లా స్థాయిలో పదో తరగతిలో పెండ్లిమర్రి మండలం నందిమండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హపీ జూన్ మొదటి స్థానాన్ని, రెండవ స్థానాన్ని కడప నాగరాజుపేట మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థి గౌతమ్ రెడ్డి, ఎర్రగుంట మండలం పోట్లదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుప్రియ మూడవ స్థానాన్ని పొందారన్నారు. వీరందరికి వరుసగా రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు నగదుతో పాటు మెమెంటో, సర్టిఫికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఏడవ తరగతిలో జిల్లా మొదటి స్థానాన్ని ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో రామేశ్వరంలో ఏడో తరగతి చదువుతున్న లలిత, జిల్లా రెండో స్థానాన్ని తొండూరు మండలం మల్లెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సౌమ్యా రెడ్డి వరుసగా రూ.6వేలు, రూ.5వేలు, మెమెంటోలు, సర్టిఫికెట్ అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, దేవరాజు, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఎ.ప్రభాకర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి బి.మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

కెఎల్ఎం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

రెడ్డి సేవా సమితి 17వ వారికోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ తెలిపారు. మంగళవారం బహుమతులు గెలుచుకున్న విద్యార్థినిలను అభినందించారు. కళాశాలలో సిఎస్ఇ మొదటి సంవత్సరం చదువుతున్న పి.లక్ష్మి భావన వ్యాసరచనలో 3వ బహుమతి సాధించారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరానికి చెందిన పి.జ్యోతి, శివాని వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో బహుమతులు సాధించారని చెప్పారు. బహుమతులు సాధించిన విద్యార్థినిలకు కందుల గ్రూప్ ఎండి డాక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి, అన్ని శాఖల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఉమెన్స్ కళాశాల విద్యార్థినులు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలలో ప్రతిభ కనబరించారు. బిఎస్‌సి మూడవ సంవత్సరం చదువుతున్న షేక్.ఆర్షియా అహమ్మద్, సయ్యద్ సానియా ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. వక్తృత్వ పోటీలలో షేక్.హర్షియా ప్రతిభ చూపారు. వీరిని ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్బలక్షుమ్మ, కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.సచీదేవి, డాక్టర్ గురమోహన్‌రెడ్డి, డాక్టర్ ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సహదేవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

చరిత్రను మలుపు తిప్పిన కార్ల్ మార్క్స్

రాయచోటి టౌన్ : మానవ చరిత్రను మలుపు తిప్పిన మహనీయుడు కార్ల్‌మార్క్స్ అని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గ శ్రేయస్సుకు ప్రపంచ దేశాలు తిరుగుతూ తన జీవితం మొత్తం దారపోశారని చెప్పారు. శ్రమ జీవుల శ్రమకు తగ్గ వేతనం తీసుకోవాలని, అది పోరాటాల ద్వారా సాధ్యమని చెప్పారన్నారు.

దొంగ ఓట్లు వేయించారు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఎన్నిక కార్యకర్తలు, వాలంటీర్లు డబ్బులు ఇచ్చి, చీటీలు ఇచ్చి ఓటర్లను ప్రలోభ పెట్టి దొంగ ఓట్లు వేయించారని పేర్కొన్నారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. మంగళవారం గాయత్రి టవర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో అక్రమాలపై వీటిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టిం చుకోలేదన్నారు. అయినప్పటికీ మేధావులైన గ్రాడ్యుయేట్ ఓటర్లు టిడిపికి ఓట్లు వేసి ఉంటారని తాము భావిస్తున్నామన్నారు. ఉమ్మడి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిని ఓడిం చేందుకు వైసిపి నాయకులు రూ.5000 నుంచి రూ. 10 వేల వరకు డబ్బులు పంచారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగ న్మోహన్‌రెడ్డి ఓటర్లను కొనుగోలు చేస్తున్నారే తప్ప ప్రజలకు అభివృద్ధి చేసి ప్రజాదరణ పొందలేదని తెలిపారు. ఎన్నికలు జరిగే ప్రక్రి యలో టిడిపి నాయకులు ప్రత్యర్థుల ఏజెం ట్లను ఎదుర్కొని ప్రతి ఘటించిన వారందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. పులి వెందులలో గతంలో ఉమేష్ చంద్ర ఎస్‌పిగా ఉన్నప్పుడు జరిగిన ఎన్నికలు మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరిగాయని తెలిపారు. కార్యకర్తలను కాపాడుకునేందుకు ఒక్కడినే కారులో బయలుదేరి వెళ్లానని తెలి పారు. తాను అక్కడికి చేరుకోగానే అక్కడే ఉన్న అవి నాష్‌రెడ్డి, రాఘవరెడ్డి దాడికి ప్రయత్నించే లోపు అక్కడున్న పోలీసులు తనను పోలీస్ కారులో పంపించారని చెప్పారు. అక్కడే ఉన్న తన కారుపై రాళ్లతో అద్దాలు పగల గొట్టారని తెలిపారు. ఏదేమైనా తన కార్యక ర్తలకు తాను అండగా లేకపోతే వచ్చే ఎన్నిక ల్లో ఎదుర్కోవడం కష్టమని చెప్పారు. సమా వేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మానవత్వం మంట కలిసిన వేళ..

- డ్రైయినేజీలో పసికందు మృతదేహం

ప్రజాశక్తి పులివెందుల టౌన్



పులివెందుల పట్టణంలో మానవత్వం మంట కలిసిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం క్రిస్టియన్ లైన్‌లో మంగళవారం ఉదయం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు డ్రయినేజీని శుభ్రం చేస్తుండగా ఓ పసికందు మృతదేహం లభ్యమైంది. ఆడపిల్ల జన్మించిందని ఏవరైనా పడేసి ఉంటారా లేక పోషణ భారమై ఇలా చేశారా.. ఏ ఇతర కారణాలైనా ఉండ వచ్చని అని పలువురు చర్చించుకుంటున్నారు. ఓ వైపు ప్రభుత్వాలు భృణ హత్యలు నేరమని చెబుతున్నప్పటికీ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం శోచనీయం.



ఎంఒయు అందుకుంటున్న ప్రతినిధులు

కేంద్ర పొగాకు పరిశోధన సంస్థతో ఒప్పందం

ప్రజాశక్తి - కడప అర్బన్

పరిశోధనలకు ఊతమిచ్చేలా రాజమండ్రి కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థతో యోగి వేమన విశ్వ విద్యాలయం మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. యోగి వేమన విశ్వవిద్యాలయం ఇంక్యుబేషన్ సెంటర్ సంచాలకులు ఆచార్య ఎ. చంద్రశేఖర్, పరిశోధన అభివృద్ధి (ఆర్ అండ్ డి) సంచాలకులు ఆచార్య పి.చంద్ర ఓబుల్‌రెడ్డి సోమవారం రాజమండ్రిలోని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ మాగంటి శేషు మాధవ్, పరిశోధకులు డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ సరళ, డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ కస్తూరి కలిసి అవగాహన పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వైవీయూ ఆచార్యులు ఎ చంద్రశేఖర్, ఆచార్య పి.చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పసుపు, అశ్వగంధ, ఆముదం, మిరప, పొగాకు మొక్కల్లో పరిశోధన నిమిత్తం పరస్పర అంగీకారం జరిగిందన్నారు. శాస్త్ర పరిశోధన ప్రాజెక్ట్స్ నిధులకు సహకారం అందించడం, పీజీ , పరిశోధక విద్యార్థుల పరిశోధనకు చేయూతను అందిస్తారని తెలిపారు. తమ విశ్వవిద్యాలయం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థతో ఎంఒయు కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని విసి ఆచార్య జింకా రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య కృష్ణా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

వైసిపికి తొత్తులుగా పనిచేశారు

కడప అర్బన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు దొంగ ఓట్లు నమోదు ప్రక్రియ నుంచి పోలింగ్ వరకు వైసిపికి తొత్తులుగా పనిచేశారని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాథమిక దశ నుంచి ఓటర్ నమోదు ప్రక్రియ మొదలుకుని తప్పుడు ధృవీకరణ పత్రాలతో దొంగ ఓట్లు ఎక్కించారని విమర్శించారు. వాటిపై అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్ ఉపాధ్యాయ ఎన్నికల ఫలితాల్లో కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు తప్పక గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నాగసుబ్బారెడ్డి, బాదుల్లా, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విజయ రామారావు మృతి బాధాకరం

కడప : మాజీ మంత్రి, సిబిఐ మాజీ డైరెక్టర్ కె. విజయరామారావు మృతి బాధాకరం అని ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య పేర్కొన్నారు. పోలీస్ అధికారిగా, సిబిసిఐ డైరెక్టర్ గా ఆయన చూపిన ప్రతిభ, నెలకొల్పిన ఉన్నత ప్రమాణాలు అనన్య సామాన్యమన్నారు. విజయరామారావు వ్యక్తిత్వం అసాధారణమైందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న పిసిసిడెలిగేట్ బండి జకరయ్య

అవినీతితో అధికార దుర్విని యోగంతో ఈనెల 13న జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యా యుల ఎమ్మెల్సీ ఎన్నికలను వెంటనే రద్దుచేసి, ఎన్నికలు సజావుగా తిరిగి నిర్వహించాలని పిసిసి డెలిగేట్ బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ. సత్తార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంతులేని అవినీతికి అధికార వైసిపి ప్రభుత్వం పాల్పడిందని వారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో గతంలో ఏ పార్టీ ఎప్పుడూ చేయని పద్ధతిలో అధికార వైసీపీ ప్రభుత్వం సరికొత్త పద్ధతిలో అవినీతికి తెరదించిందని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఒత్తిళ్లతో వాలంటీర్లను లోబరుచుకుని ఓటు అర్హత లేని 6,7,8,9,10 తరగతులు మాత్రమే చదువుకున్న వారిని నమోదు చేయించి వారితో వైసిపి పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయించడం అవినీతికి పరాకాష్ట అన్నారు. సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ అయినా ఎన్నికల కమిషన్ ఎన్నికలను రద్దు చేయకపోవడం అవినీతిలో భాగమే అని వారు పేర్కొన్నారు. రకరకాలుగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడమే కాకుండా పూర్తిగా అధికార దుర్వినియోగానికి అధికార పార్టీ పాల్పడిందన్నారు. అనర్హులను ఓటర్లుగా నమోదు చేసిన అధికారులను గుర్తించి వెంటనే వారిని సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీగా తాము డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. అవినీతితో, అధికార దుర్వినియోగంతో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సులలో 30 రోజులపాటు, సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లలో 30 రోజులు, సిసి టివి కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లలో13 రోజుల పాటు ఇచ్చే ఉచిత శిక్షణను గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18-45 సంవత్సరాలలోపు వయసు కలిగిన నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. పై తెలిపిన కోర్సులలో ఉచిత శిక్షణ పొందేందుకు ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440905478, 6302833546లలో సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్‌ఆర్‌ఎం కళాశాలలో కళాశాల హ్యు మానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో గణితం ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణిత ఔత్సాహికులు అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని ప్రతి ఏడాదీ మార్చి 14న గణిత స్థిరాంకం గుర్తించడానికి నిర్వహించుకుంటారని తెలిపారు. మ్యాథమెటిక్స్ పజిల్స్ పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతులు డాక్టర్ శ్రీ వాణి, ప్రోగ్రాం సమన్వయకర్తలు జి.శ్రీధర్, డాక్టర్ వి.రామచంద్ర రెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు సాధించిన వారితో కళాశాల యాజమాన్యం

ప్రభుత్వ ఉద్యోగాలకు వేదవ్యాస విద్యార్థులు ఎంపిక


ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక నెహ్రూ రోడ్డులోని వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై అందరి ప్రశంసలు అందుకున్నారని కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కె.కావ్య, జి.రాహుల్, ఎస్.వసంత్ కేంద్ర ప్రభుత్వ నిర్వహించిన గ్రామ డాక్ సేవక్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి కళాశాలలో ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన కల్పిస్తూ, వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. కళాశాల నుంచి ఇప్పటికే అనేక మంది విద్యార్థులు పలు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కూడా విద్యార్థులకు మెరుగైన శిక్షణ, ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శనరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.నాగరాజ, డి.రామలక్ష్మిరెడ్డి, స్కిల్స్ కోచింగ్ నిర్వాహకులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

పంట నమోదులో తప్పులుంటే సవరించుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పంట నమోదులో ఏవైనా తప్పులుంటే సవరించుకోవాలని ఎడిఎ వెంకట సుబ్బయ్య రైతులకు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన మంగళవారం ఎడిఎ ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రైతుల సమస్యలపై ప్రతి నెల మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను మండల స్థాయిలో చర్చించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పలువురు రైతులు టార్పాలిన్ పట్టలు, బ్యాటరీ పంపులు, పవర్ స్ప్రేయర్, వ్యక్తిగత పని ముట్లు, విత్తన గోర్లు, గుంటకలు, కల్టివేటర్లు అడుగుతున్నారని సిబ్బంది అధికారుల దృష్టికి తెచ్చారు. సంబంధించిన డీలర్లతో మాట్లాడి రైతులు పొలాల్లో డ్రిప్ పరికరాలు అమర్చేలా చూడాలన్నారు. శనగలు ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధరకు అమ్ముకునేలా అవగాహన కల్పించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ వెంకటసుబ్బయ్య

క్రైం కార్నర్


మృతుడు గురుశేఖర్‌రెడ్డి

ట్రాక్టర్ ట్రాలీ తగిలి రైతు మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని సీతారామాపురం గ్రామ పంట పొలాల్లో మంగళవారం ట్రాక్టర్ ట్రాలీ తగిలి ఉప్పులూరు గురుశేఖర్‌రెడ్డి (36) అనే రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం గ్రామానికి చెందిన యు.చిన్న ఓబుల్‌రెడ్డి తమకున్న రెండెకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. ఓబుల్‌రెడ్డి కుమారుడు గురుశేఖర్‌రెడ్డి, అతని భార్య ఓబులమ్మ తమకు చెందిన ఎపి04 టిఎక్స్ 7158 ట్రాక్టర్‌లో నూర్పిడి చేసిన పసుపు పంటను తరలించే పనులు చేపట్టారు. ట్రాక్టర్ డ్రైవర్ నాగన్న ట్రాక్టర్‌ను వెనుకకు నడుపుతుండగా ప్రమాదవశాత్తూ గురుశేఖర్‌రెడ్డికి ట్రాలీ తగిలింది. బలంగా తగలడంతో కుటుంబ సభ్యులు వెంటనే వైద్యం కోసం తరలిస్తుండగా మార్గ మధ్యంలో గురుశేఖర్‌రెడ్డి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై చాపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురుశేఖర్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసేవాడు. యువరైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

కారు, లారీ ఢీకొని మరొకరు..


దెబ్బతిన్న కారు

చెన్నూరు : చెన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలెంపల్లె బైపాస్ రోడ్డులో మంగళవారం ఉదయం కారు, లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలైనట్లు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కడప నగరం అశోక్‌నగర్‌కు చెందిన అల్లాడి సామ్సన్ (44) మతి చెందగా, గాయపడ్డారు. కడప నుండి తాడిపత్రి వైపు కారులో వెళుతుండగా, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని క్రాంతినగర్‌లో నివాసం ఉంటున్న మల్లెబోయిన కిషోర్(40) కనిపించడం లేదని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఈ నెల 8న కుటుంబ సభ్యులతో గొడవపడి, అదే రోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇంటి నుండి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో కిషోర్ భార్య ఉమా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 63055 59746, 91211 00530 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.


మల్లెబోయిన కిషోర్

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


విద్యార్థికి మాత్ర వేస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు


ఖాజీపేట : విద్యార్థులచే మాత్రలను మింగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య సాయిప్రవీణ్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉర్దూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఆహారం తీసుకునే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. గోర్లు కత్తిరించుకోవడం, బయటికి వెళ్లేటప్పుడు చెప్పులు వేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్రాలు విసర్జన చేయరాదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ 0-2 పిల్లలకు సిరప్ అందజేయాలని చెప్పారు. 3 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలు 400 గ్రాముల ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** నులి పురుగులు అనేక రుగ్మతలకు కారణమని, వాటిని ఒక్క మాత్రతో తరిమేసి ఆరోగ్యంగా జీవించాలని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, అగ్రహారం అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.ముబీన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణకు ఆల్ బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19ఏళ్లలోపు బాలబాలికలు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత వేసుకోవాలన్నారు. ఈ నెల 18న మ్యాప్ అప్ డే రోజున వేసుకోవాలని తెలియజేశారు. ఈ మాత్రలు అన్ని కాలేజీల్లో, ఉన్నత పాఠశాల్లో, ప్రాథమిక పాఠశాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్నాయన్నారు. డాక్టర్ ముబీన్ వ్యాధి లక్షణాలను వివరించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య ప్రతి పాఠశాలలో చేతులను శుభ్రం చేసుకొనే విధానాన్ని వివరించారు. ఎంపిడిఒ శివరామిరెడ్డి బాలికల ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన మాత్రలను విద్యార్థులచే మిం గించారు. కార్యక్రమంలో మండల ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి, ప్రధా నోపాధ్యాయులు సుజాత, మండల ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగ భూషణం, సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, ఆశ నోడల్ పర్సన్ అరుణకుమారి, సూపర్‌వైజర్ సునీల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి కీర్తి, ఎఎన్ఎంలు శివనాగమణి, సునీత, ఆశ కార్యకర్తలు దేవి, రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి నరసమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చాపాడు :** మండల పరిధిలోని బద్రిపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డిపిఎం శశిభూషణ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు నులిపురుగు నివారణ మందులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. వీటిని వాడడం వల్ల పిల్లల్లో పెరుగుదల కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఎంఇఒ రవిశంకర్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **వేంపల్లె :** కడుపులో ఉన్న నులి పురుగుల నివారణకు అల్బెండజల్ మాత్రలను మింగాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫిఉన్నిషా బేగంసూచించారు. తాళ్లపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగ ళవారం విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దస్తగిరి, ఉపాధ్యా యులు శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, అబ్దుల్ ఫేజుల్, సుదర్శన్‌రెడ్డి, ముని నాగలక్ష్మి, గంగాభవాని, రమణమ్మ, సిఆర్‌పి కళ్యాణి, సిహెచ్ఒ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాల్లో దాదాపు 5600 మంది 19ఏళ్లలోపు పిల్లలకు అల్ బెండజోన్ మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ ఖాదర్‌వల్లి, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ప్రభుత్వ వైద్యలు జ్యోత్స్న, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు పాల్గొన్నారు. రూరల్ పరిధిలో చిలమకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉషోదయ ప్రయివేట్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని డాక్టర్ సురేష్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **కలసపాడు :** విద్యార్థులు పరీక్షల కాలంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్రా, ప్రభావతి అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు, నులిపురుగు, నివారణకు సంబంధించి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఎం. అరుణకుమారి ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చెన్నూరు :** పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని రామనపల్లి, రాచినాయపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. తొలిరోజు 6, వేల104 మంది పిల్లలకు మాత్రలను మింగించారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, ఎంపిడిఒ గంగనపల్లి సురేష్ బాబు, ఎంఇఒ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **వల్లూరు :** పిల్లలకు అల్బెండజోల్ మాత్ర అందించడం ద్వారా నులిపురుగుల సంక్రమణకు సులభంగా నిర్మూలించవచ్చని అడిషనల్ డి ఎం హెచ్ఒ డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. మండల కేంద్రంలోని వల్లూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ శ్రీనివాసులు, మండల వైద్యాధికారి పనింద్ర , సిహెచ్ఒ వేణుగోపాల్ , హెల్త్ సూపర్‌వైజర్ శివరాం రెడ్డి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..** జంతు శాస్త్ర శాఖ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగు మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ వెంకట చంద్ర రెడ్డి నులి పురుగుల నివారణ ఆవశ్యకతను వివరించారు. జంతు శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ పి. రవి శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వై. సావిత్రి, పి. శివరామ కృష్ణ, డాక్టర్ నాగరాజు విద్యార్థులకు నులిపురుగులు మాత్రలను పంపిణీ చేశారు.

చైతన్యం ఉంటే వినియోగదారుల హక్కులు రక్షించొచ్చు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రజల్లో చైతన్యం, వాడకపు వస్తువుల్లో ప్రత్యామ్నాయం, ఇందుకు ప్రభుత్వ సహకారం ఉంటే వినియోగదారల హక్కుల పరిరక్షింపబడుతాయని ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు అన్నారు. బుధవారం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఒక వస్తువు వినియోగానికి పనికిరాకుండా పోయిందని, వినియోగదారులు గ్రహించిన అనంతరం న్యాయపోరాటం చేయాలనే చైతన్యం కలగాలని సూచించారు. ఆ వస్తువుకు ప్రత్యామ్నాయం ఉండాలని ఈ రెండిటికీ అంటే న్యాయ పోరాటానికి, ప్రత్యామ్నాయానికి ప్రభుత్వ సహకారం ఉంటే వినియోగదారులు గెలుస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. బీమా సంస్థల్లో ప్రభుత్వ సంస్థ అయిన ఎల్ఐసి కొంత వరకు మెరుగైన సేవలందిస్తున్నప్పటికీ, ప్రయివేటు బీమా సంస్థలు కేవలం తమ ఏజెంట్ల వ్యాపార లక్ష్యం పూర్తి చేసేందుకు పూర్తి నిబంధలను దాచి ఉంచి వ్యాపారాన్ని సాగించడం ఆమోదయోగ్యం కాదన్నారు. వినియోగదారులు పరిరక్షణ చట్టం 1986 వచ్చిందన్నారు. 2019లో బలోపేతం అయిందన్నారు. తాము గతంలో వినియోగదారుల చైతన్యం కోసం పలు కార్యక్రమాలు చేశామన్నారు. మెడికల్ మాఫియా ఇంకా ఎక్కువగా ఉందని వినియోగదారులు చైతన్యవంతులైతే ఇలాంటి మాఫియాను రూపుమాపొచ్చన్నారు. వినియోగదారుల రక్షణకు యాక్ట్ ఇన్ డెరొగేషన్ (అదనపు చట్టం) ఉందన్నారు. వినియోగదారులకు అవసరమైన అన్ని చట్టాలకు ఈ చట్టం అదనం అన్నారు. నాణ్యతతో రాజీ పడకపోవడం, అవగాహన, ప్రభుత్వ సహకారం ఉంటే ప్రతి పోరాటంలో వినియోగదారుడే అంతిమ విజేతగా నిలుస్తాడని న్యాయవాది గొర్రె శ్రీనివాసులు తెలిపారు.


బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు

ఎమ్మెల్యే ఆర్థిక సాయం


ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నగదు అందుకుంటున్న బాబు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గత నెల 23న ఇక్కడి ఓ ప్రయి వేట్ ఆసు పత్రిలో అధిక రక్త స్రావంతో మృతి చెందిన స్వర్ణకుమారి కుటుంబికులకు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి మంగళవారం ఆర్థికసాయం చేశారు. కొండాపురం మండలం చౌటిపల్లి గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తూ ప్రసవానంతరం అధిక రక్తస్రావంతో స్వర్ణకుమారి మృతి చెందిన విషయం తెలిసిందే. జమ్మలమడుగు మండలం వేపరాల గ్రామానికి చెందిన మృతురాలి భర్త కరూమూరి బాబుకు ఎమ్మెల్యే రూ.5లక్షలు అందజేశారు.

జెఎన్‌టియు బి.టెక్ ఫలితాలు విడుదల

- ప్రిన్సిపల్ ఎస్.వసుంధర

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన బి టెక్ రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ (ఆర్-20) పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర తెలిపారు. ఈ ఫలితాలను తక్కువ సమయంలోనే విడుదల చేసినందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులైన ప్రొఫెసర్ కె.త్యాగరాజన్, డాక్టర్ ఎస్.రాధాక్రిష్ణలను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ అభినందించారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్‌లో పరీక్ష ఫలితాలు తెలుసుకోవచ్చునని ఆమె వివరించారు.

వచ్చే ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె


టిడిపి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి

వచ్చే ఎన్నికల్లో కూడా ఐక్యంగా పార్టీ కోసం పని చేయాలని ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి సూచించినట్లు వేంపల్లె మండల టిడిపి నాయకులు తెలిపారు. సింహాద్రిపురం మండలం కసనూరులో ఉన్న ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డిని మంగళవారం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా వారు వేంపల్లెలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తీరుపై ఆయన చర్చించినట్లు తెలిపారు. సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి కోసం పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకునికి బిటెక్ రవి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. అనంతరం పార్టీ కార్యక్రమాలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు పాపిరెడ్డి, మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, గోగుల మారుతి, మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, డక్కా రమేష్, ఈశ్వరయ్య ఉన్నారు.

ప్రణాళికతో చదివితే.. మానసిక ఒత్తిడి ఉండదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రణాళికతో చదివితే మానసిక ఒత్తిడి ఉండదని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. కెనడా దేశానికి చెందిన ఒటిఎఫ్ సంస్థ వారి సహకారంతో మంగళవారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలలోని 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న బాలికలకు ఒఎస్‌డి, ఎంఇఒ వీరారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సేవాసమితి అధ్యక్షులు రాజు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరీక్షలు అనే భయం వీడాలన్నారు. ప్రతి బాలిక ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సేవాసమితి సభ్యులు చాంద్ బాషా, హరీష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

విద్యా యజ్ఞంలో భాగంగా మైదు కూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న 96మంది విద్యార్థినులకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ గాయత్రి సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిగినే వేంకటేశ్వర్లు , ట్రస్ట్ కార్యదర్శి మధు, ఉప కార్యదర్శి శివానందరెడ్డి, ట్రస్టు సభ్యులు సుబ్బయ్య, పాఠశాల ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న దాతలు

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి


స్టేషనరి అందజేస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారని రైస్ మిలర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాపాడు మండలానికి చెందిన మాడూరు వినయ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుంకేసుల వద్ద ఉన్న కస్తూరిబా పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేరీ మంజుల, వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు ప్రశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలకు నేటికీ తిరుగులేదు


నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కార్ల్ మార్క్స్ సిద్ధాంతాలకు నేటికీ తిరుగులేదని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీవిద్య జూనియర్ కాలేజీలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనిల్, మోహన్, నవీన్, మహేష్ పాల్గొన్నారు.